## సరైన ధ్రువపత్రాలు ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, మార్చి 18 : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లతో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎక్కడ కూడా భూములు విక్రయించినా, కొనుగోలు చేసినా డాక్యుమెంట్ రైటర్లు సరైన ధ్రువపత్రాలు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. రియల్టర్లు భూములు సరైన పత్రాలు ఉంటేనే లావాదేవీలు చేయాలని, ఇలా చేస్తే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. డాక్యుమెంట్ రైటర్లు, రియల్టర్లు భూ క్రయవిక్రయాల విషయంలో అక్రమాలకు పాల్పడకుండా సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ ప్రతినిధులు, డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలకు సహకరించాలి

బాన్సువాడ, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, బాన్సువాడ ఆర్డీవో రాథోడ్ రమేశ్ సూచించారు. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. రూ.50 వేల కన్నా ఎక్కువ డబ్బులను తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పెండ్లిలు చేసే వారు డ్రా చేసిన బ్యాంకు పాసుబుక్కుతోపాటు పెండ్లి పత్రిక, తదితర పత్రాలు, ఆధారాలను వెంటపెట్టుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని మల్లారం, పొతంగల్ గ్రామ శివారుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. లిక్కర్, డబ్బులు, ఆభరణాలు తదితర వస్తువులు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట డీఏవో సువర్ణ, ఏఆర్ఐ అశోక్ తదితరులు ఉన్నారు.

# ప్రశాంతంగా 'పది' పరీక్షలు



ఎల్లారెడ్డి జడ్పీహెచ్ఎస్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



నిజాంసాగర్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 18 : జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు పరీక్ష నిర్వహించగా, విద్యార్థులు గంట ముందుగానే ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సెంటర్ల వద్ద సందడి నెలకొన్నది. ఎల్లారెడ్డి పట్టణంలోని మూడు సెంటర్లలో మొత్తం 703 మంది విద్యార్థులకు గాను అందరూ హాజరయ్యారని ఎంఈవో వెంకటేశం తెలిపారు. సదాశివనగర్ మండలంలో ఐదు సెంటర్లు ఏర్పాటు చేయగా, 611 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవో యోసెఫ్ తెలిపారు. రామారెడ్డి మండలంలోని మూడు కేంద్రాల్లో 503 మందికి ఒకరు గైర్హాజరయ్యారని ఎంఈవో చెప్పారు.

పిట్లంలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో మొత్తం 519 మందికి ముగ్గురు గైర్హాజరయ్యారని ఎంఈవో దేవీసింగ్ తెలిపారు. పెద్ద కొడప్‌గల్ కేంద్రంలో 209 మందికి ముగ్గురు గైర్హాజరయ్యారని సీఎస్ రమణారావు తెలిపారు. మద్నూర్ మండలంలోని మూడు కేంద్రాల్లో 508 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉమ్మడి నిజాంసాగర్ మండడలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 442 మంది విద్యార్థులకు ఇద్దరు గైర్హాజరైనట్లు ఎంఈవో దేవీసింగ్ తెలిపారు.

బాన్సువాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 250 మందికి గాను అందరూ పరీక్ష రాశారు. జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో 220గాను 219 మంది హాజరయ్యారు. బాలికల ఉన్నత పాఠశాలలో 200 మందికిగాను 199 మంది హాజరుకాగా ఒక్క విద్యార్థి గైర్హాజరయ్యాడు. జడ్పీహెచ్ఎస్ కోనా బాన్సువాడ పాఠశాలలో 194 మందికిగాను అందరూ హాజరయ్యారు. జడ్పీహెచ్ఎస్ బోర్లంలో 231 మందికిగాను 230 మంది హాజరుకాగా ఒక్క విద్యార్థి గైర్హాజరయ్యాడు. మొత్తం మండలంలో 1,095 మంది విద్యార్థులకుగాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజరుకాగా 1092 పరీక్షలకు హాజరయ్యారు. బాన్సువాడ ఎంఈవో నాగేశ్వర్‌రావు, డీఎస్పీ సత్యనారాయణ గౌడ్, పట్టణ ఎస్‌హెచ్‌వో కృష్ణ పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

బీబీపేట్‌లో బాలుర ఉన్నత పాఠశాలలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. (ఎ) సెంటర్‌లో 180 మంది, (బి) సెంటర్‌లో 170 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మాందాపూర్ సెంటర్‌లో 104 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. దోమకొండలోని బాలుర ఉన్నత పాఠశాలలో 162 మంది విద్యార్థులు, అలాగే బాలికల ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈవో కార్యాలయ సిబ్బంది తెలిపారు.

### విద్యార్థుల కోసం ఆటోల ఏర్పాటు

దోమకొండ, మార్చి 18 : మండలంలోని అంబారిపేట్ నుంచి పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల కోసం గ్రామానికి చెందిన ఆరుట్ల అనిల్ సొంత ఖర్చులతో ఆటోలను ఏర్పాటు చేశారు. అంబారిపేట జడ్‌పీహెచ్ఎస్ నుంచి బీబీపేట పరీక్షా కేంద్రం వరకు ఆటోల సౌకర్యం ఉంటుందన్నారు. విద్యార్థుల పరీక్షలు అయ్యేంత వరకు ఆటోల సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. అంబారిపేట పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి సరస్వతీ విగ్రహానికి పూలమాలవేసి విద్యార్థులకు ఉచిత సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు ఉచితం ఆటో సౌకర్యం కల్పించినందుకుగాను విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.



దోమకొండలోని 30 పడకల దవాఖానను వంద పడకల దవాఖానగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ కోరారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను హైదరాబాద్‌లో సోమవారం కలిసి విన్నవించారు.

– దోమకొండ, మార్చి 18

## కొనసాగుతున్న షెడ్డు నిర్మాణ పనులు

బాన్సువాడ రూరల్, మార్చి 18 : మండలంలోని బోర్లం క్యాంపులో ఉన్న దుర్గామాత ఆలయం వద్ద రూ.5లక్షలతో చేపట్టిన షెడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బాన్సువాడ ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింహులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పనులను సోమవారం పరిశీలించారు. షెడ్డు నిర్మాణం కోసం గతంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి రూ.5లక్షలు మంజూరు చేశారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాసరెడ్డి, మంద శ్రీనివాస్, పర్వంరెడ్డి, గోపన్‌పల్లి సాయిలు, జలీల్, మన్నె సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం

దోమకొండ, మార్చి 18 : మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో మల్లన్నస్వామి, గొల్ల కేతమ్మ, మేడలమ్మ కల్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ, మునిరాజుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య

వినాయక్‌నగర్, మార్చి 18: నిజామాబాద్ నగర శివారులోని నిజాంసాగర్ కాలువలో దూకి దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. నార్త్ రూరల్ సీఐ సతీశ్ కుమార్,ఎస్సై అశోక్ ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో మృతదేహాలను బయటికి తీయించారు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకోగా, ఇందుకు సంబంధించిన వివరాలు.. బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామానికి చెందిన మల్లారం పెద్ద బాబయ్య(60), మల్లారం పోచవ్వ(55) దంపతులతోపాటు వారి కుమారుడు మల్లారం శేఖర్ జిల్లా కేంద్రంలోని బాబాన్ సాహెబ్ పహాడ్ దర్గా వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నారు. బాబయ్య, పోచవ్వ దంపతులు పదిహేను రోజులకోసారి తమ గ్రామానికి వెళ్లి వచ్చేవారు. సోమవారం ఉదయం కాలువలో నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో రెండు మృతదేహాలను గుర్తించిన పోలీసులు బయటికి తీయించారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన శేఖర్ మృతదేహాలను చూసి తన తల్లిదండ్రులని పోలీసులకు తెలిపాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడని ఎస్సై అశోక్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీశ్ తెలిపారు.

## వేతనాలు చెల్లించాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

కామారెడ్డి, మార్చి 18 : జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా కమిటీ సభ్యులు నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈ నెల 21 వరకు నిరసన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా కమిటీ సభ్యులు పసుపునూరి వెంకటరమణ, వంగ రాహుల్, వరలక్ష్మి, బొర్రోల్ల సంధ్య, కవిత, లక్ష్మి, హరినాథ్, రేణుక, అర్షియా, పెనుకొండ సంధ్య, దీవెన పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

## ఉపాధి హామీ పనులను పకడ్బందీగా నిర్వహించాలి

దోమకొండ, మార్చి 18 : గ్రామాల్లో ఉపాధి హామీ పథకం లో భాగంగా చేపట్టే పనులను పకడ్బందీగా నిర్వహించాల ని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్ట్ అదనపు డైరెక్టర్ వామన్‌రావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక 14వ తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూలీలకు పని ప్రదేశాల్లో కావాల్సిన వసతు లు ఏర్పాటు చేయాలన్నారు. మస్టర్ రికార్డులు విధిగా చేపట్టి పనుల్లో అవకతవకలు లేకుండా చూడాలని సూచిం చారు. మండలంలో ఇప్పటి వరకు చేపట్టిన పనులు రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పారదర్శకతతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్, దత్తద్రి, ప్రశాంత్, ఎంపీడీవో రమేశ్, పూర్వపు ఎంపీడీవో చిన్నారెడ్డి, సాయిలు, తిరుపతి రెడ్డి, రజినీ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. .




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు పీడీ వామన్ రావు

## నేడు సర్వసభ్య సమావేశం

సదాశివనగర్, మార్చి 18 : ఎంపీపీ అనసూయా రమేశ్ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

## పశువులకు టీకాలు

పిట్లం, మార్చి 18: మండలంలోని చిల్లర్గి, చిన్నకొడప్‌గల్ గ్రామాల్లో సోమవారం పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 354 ఆవులు, 649 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని డాక్టర్ సంతోష్ తెలిపారు.

## బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక

గాంధారి, మార్చి 18: బీజేపీ మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శులుగా శ్రీకాంత్‌గౌడ్, రామ్‌సింగ్, ఉపాధ్యక్షుడిగా రాజిరెడ్డితోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను నియమించారు.

## బీడీ పింఛన్ పెంచాలి

దోమకొండ, మార్చి 18 : పీఎఫ్ నంబర్ ఉండి రాజీనామా చేసిన బీడీ కార్మికుల పింఛన్‌ను రూ. 10వేలకు పెంచాలని తెలంగాణ నూతన బీడీ కార్మిలకు సంఘం రాష్ట్ర కార్యదర్శి శివంది సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేందటే ఆందోళన చేస్తామన్నారు.

# రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- దెబ్బ తిన్న పంటలను పరిశీలించిన నాయకులు
- నష్టం వివరాలను సేకరించిన వ్యవసాయ శాఖ అధికారులు



భూంపల్లి శివారులో దెబ్బతిన్న మక్కజొన్న పంటను పరిశీలిస్తున్న మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్ రావు



అంతంపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ అపర్ణ

సదాశివనగర్/డోంగ్లీ/పిట్లం/నిజాంసాగర్/భిక్కనూరు, మార్చి 18: అకాల వర్షాలు, వడగండ్లతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు కోరారు. పలు మండలాల్లో దెబ్బతిన్న పంటలను సోమవారం పరిశీలించారు. పంట నష్టంపై వ్యవసాయ అధికారులు సర్వే చేశారు. ప్రభుత్వానికి నష్టం వివరాలను అందజేస్తామని చెప్పారు. సదాశివనగర్ మండలంలో పంటలను మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు పరిశీలించారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని కోరారు. డోంగ్లీ మండలం ఎన్‌బుర శివారులో దెబ్బతిన్న వరి పంటలను మండల వ్యవసాయ అధికారి రాజు, ఏఈవో స్రమీన్ పరిశీలించారు. పిట్లం మండలంలో కురిసిన వర్షానికి నూర్పిడి పూర్తయిన మక్కజొన్న పూర్తిగా తడిసిపోయింది. దీంతో రైతులు మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఆవరణలో మళ్లీ ఆరబెట్టారు. త్వరగా కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలని కోరారు. నిజాంసాగర్ మండలంలోని మంగ్లూర్, వెల్గనూర్ గ్రామాల్లో ఏఈవో స్వర్ణత, వడ్డెపల్లి, మల్లూర్, జక్కాపూర్, తండాల్లో ఏఈవో రేణుక పర్యటించి దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించారు. భిక్కనూరు మండంలోని పలు గ్రామాల్లో ఏడీఏ అపర్ణ పర్యటించి, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నష్టం వివరాలపై నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఆమెవెంట ఏవో రాధారెడ్డి, ఏఈవో రజిత ఉన్నారు.

**తహసీల్దార్‌కు వినతి..**

భిక్కనూరు మండలంలో సుమారు 3వేల ఎకరాల్లో వరి, 1600 ఎకరాల్లో మక్కజొన్న, 200 ఎకరాల్లో కూరగాయలు, 50 ఎకరాల్లో ఇతర పంటలు దెబ్బతిన్నాయని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ శివప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచులు వేణు, పోతిరెడ్డి, మనోహరా రమేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు మల్లేశం, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, విండో చైర్మన్లు భూంరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



భిక్కనూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ముదెల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

## బాధిత కుటుంబాలకు పరామర్శ

గాంధారి, మార్చి 18: మండలంలోని ముదెల్లి గ్రామంలో ఇటీవల చెరువులోపడి మృతిచెందిన చిన్నారులు మిద్దెల రవీందర్, సుతారీ శశాంక్ కుటుంబాలను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకొని, బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. గౌరారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బ్యాగరి పోచయ్య తల్లి మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను సురేందర్ పరామర్శించారు. కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. ఆయన వెంట ఎంపీపీ రాధా బలరాం, గండివేట్ మాజీ సర్పంచ్ అబ్దుల్ ఫారూక్, గంగాధర్, లక్ష్మణ్ ఉన్నారు.

## రాజేశ్వరాలయాన్ని దర్శించుకున్న జుక్కల్ ఎమ్మెల్యే



అన్నపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

డోంగ్లీ, మార్చి18: మండలంలోని ఎన్‌బుర గ్రామ శివారులోని రాజేశ్వరాలయాన్ని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సోమవారం దర్శించుకున్నారు. భక్తులు నిర్వహించిన అన్నపూజలో పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు నాగనాథ్ పాటిల్, మాదాయప్ప స్వామి, పరమేశ్ పటేల్ ఉన్నారు.

## నంబర్ ప్లేట్ లేని బైకులు సీజ్

ఎల్లారెడ్డి, మార్చి 18 : మండలంలోని అన్నాసాగర్ గేటు సమీపంలో ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబర్ ప్లేట్, సరైన ధ్రువపత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

నిజాంసాగర్, మార్చి18: మండలంలోని గోర్గల్ శివారులో బేడీల మైసమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. చివరి కుస్తీలో గెలుపొందిన మల్లయోధుడికి రూ.2500 నగదు బహుమతిని గ్రామ పెద్దలు దుర్గారెడ్డి, మహేందర్‌రెడ్డి, అంజయ్య, అంబయ్యల చేతుల మీదుగా అందజేశారు. పోటీల్లో పాల్గొనేందుకు చుట్టుపక్కల మండలాలతోపాటు సంగారెడ్డి, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు.



నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ TC పోయినది

★ BOLLISHETY ANILKUMAR S/o. BOLLISHETY GANGARAM R/o. దూదిగాం, మం॥ మెండోరా, జి॥ నిజామాబాద్ నేను శ్రీ విజయసాయి జూనియర్ కాలేజ్ బోధన్‌లో ఇంటర్మీడియట్ చదివాను. నా యొక్క TC (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్) రి.నెం.13209 (Adm no.12846) బైక్‌పై దూదిగాం నుండి మెండోరకు వెళ్ళుచుండగా పోయినది. దొరికినవారు.సెల్:90143 22685

NTZ-324629

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

పిట్లం/బిచ్కుంద, మార్చి 18: పిట్లం మండలంలోని తిమ్మానగర్ సొసైటీలో చైర్మన్ సాయారెడ్డి అధ్యక్షతన సోమవారం మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏకకాలంలో రుణమాఫీ చేయాలని పాలకవర్గ సభ్యులు, రైతులు తీర్మానం చేశారు. జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ సాయిలు, డైరెక్టర్లు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, సీఈవో అశోక్‌గౌడ్, విండో మాజీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బిచ్కుంద సొసైటీలో చైర్మన్ బాలాజీ అధ్యక్షతన మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలన్నారు. అకాల వర్షంతో దెబ్బతిన్న పంట నష్టంపై అంచనావేసి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ మాధవరావు, సీఈవో శ్రావణ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ఉచిత ఉపాధి శిక్షణ

కామారెడ్డి, మార్చి 18 : సెట్విన్ ఆధ్వర్యంలో వివిధ వృత్తి విద్య కోర్సుల్లో మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ కో–ఆర్డినేటర్ సయ్యద్ మొయిజుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ అవేర్‌నెస్ ప్రోగ్రాం, ఎంఎస్ ఆఫీస్, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహందీ కోర్సుల్లో ఈ నెల 26 నుంచి శిక్షణ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులని, ఫీజులో 50 శాతం రాయితీతోపాటు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందిస్తామని తెలిపారు. కోర్సు అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామని, ఆసక్తి ఉన్న యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7386180456 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలి



రెవెన్యూ, పోలీస్ శాఖ సిబ్బందికి సూచనలిస్తున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి

మద్నూర్, మార్చి18: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జుక్కల్ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టి ఎన్నికలు సజావుగా సాగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర సరిహద్దు వద్ద నిఘా పెట్టి ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనంతరం సరిహద్దులో చెక్‌పోస్టును పరిశీలించారు. సమావేశంలో బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, తహసీల్దార్ ముజీబ్, సీఐ నరేశ్, ఎస్సై శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ భరత్ పాల్గొన్నారు.

### నిరంతరం తనిఖీలు..

ఎల్లారెడ్డి, మార్చి 18 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో డబ్బు, మద్యం రవాణా కాకుండా ప్రత్యేక బృందాల ద్వారా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని ఏఆర్‌వో, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం వద్ద, సదాశివనగర్ మండలంలోని దగ్గి వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు ఎస్ఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.